౨౩

# ఎవరు పాపి?

ఒకానొక అడవిలో ఒక ముని తపస్సు చేసుకుంటుండేవాడు.

ఆ అడవికి అటూ–ఇటూ వున్న ఊళ్ళను కలిపే దారి, ఆ ముని ఆశ్రమానికి సమీపం నుంచే పోతుండేది. ఆ ఊళ్ళు పెద్దవై ఆ బాట మీద ప్రయాణికుల సంఖ్య బాగా పెరగడంతో 'గవరయ్య' అనే వ్యక్తి ఆ ఆశ్రమానికి ఎదురుగా ఒక సారాదుకాణం పెట్టాడు. అలసిపోయిన ప్రయాణికులు రోజూ అక్కడ ఆగి సారా సేవిస్తుండేవారు.

మొదట్లో ముని ఇదేమీ పట్టించుకోకపోయినా... అక్కడ చేరేవారి సంఖ్య క్రమంగా పెరుగుతుండడంతో ముని దృష్టి అటు మళ్ళసాగింది. అంతమంది మనుషులు అక్కడికి వచ్చి త్రాగుడికి బానిసలు అయిపోతుండడం చూసి ఆయన మనస్సు క్షోభించింది.

క్రమంగా ముని తన ధ్యానాన్ని తగ్గించి, ఆ సారాయి దుకాణానికి వచ్చిపోయే వారిని గమనించడం ఎక్కువైపోయింది. ఆ దుకాణంలోకి ఒక వ్యక్తి ప్రవేశించగానే ఒక రాయి తీసి ప్రక్కన వేయడం మొదలు పెట్టాడు.

ఇలా కొన్ని నెలలు గడిచేసరికి ఆ రాళ్ళు ఒక పెద్దగుట్టగా మారాయి.

ఒక రోజున–

ఆ ప్రాంతంలో ఏదో పెద్ద పండుగ అవడంతో ఏ వూరివాళ్ళు ఆ ఊరిలోనే ఉండి పోయారు. సారా దుకాణంలోకి వచ్చేవాళ్ళు ఎవరూ లేకపోవడంతో గవరయ్య ఖాళీగా ఉండిపోయాడు. ఎదురుగా చూస్తే ముని కనిపించాడు.

స్వాములోరికి దణ్ణం పెట్టుకుందామని ఆయన దగ్గరకెళ్ళి, "దండాలు స్వామీ!" అన్నాడు గవరయ్య.

లోపల గవరయ్య అంటే కోపం వున్నా, పైకి ఏమీ అనలేదు ముని.



అక్కడున్న రాళ్ళగుట్టను చూసి, "ఇదేమిటి సాములూ..?" అని అమాయకంగా అడిగాడు గవరయ్య.

"అది నీ పాపాలకు కొలమానం!" అన్నాడు ముని కోపంతో.

"ఏమిటి సాములూ... నేనేం చేశాను?" అన్నాడు గవరయ్య భయంగా.

"అవును... ఇంత మంది పేద ప్రజలు నీ దుకాణానికి వచ్చి త్రాగుడుకి బానిసలయ్యారు" అన్నాడు ముని.

"అయ్యో సాములూ... తెలియక పాపం చేశాను. ఇంతమంది నా మూలంగా నాశనం అయ్యారా?" అంటూ పశ్చాత్తాపంతో ప్రాణం విడిచాడు గవరయ్య.

తన మాటలవల్ల గవరయ్య ప్రాణం పోవడం చూసి పశ్చాత్తాపంతో ముని కూడా ప్రాణం విడిచాడు.

యమ కింకరులు వచ్చి వారిద్దరి ప్రేతాత్మలనూ యమలోకానికి తీసుకుని వెళ్లారు.

చిత్రగుప్తుడు వారిద్దరి నేరాలు చదివి వినిపించాక యమధర్మరాజు తన తీర్పుని ప్రకటించాడు.

"గవరయ్య తన వృత్తి ధర్మం కొద్దీ సారాయి దుకాణం పెట్టుకున్నాడు. అందులో అతని తప్పేమీ లేదు. అతను కావాలని ఎవరికీ త్రాగుడు అలవాటు చేయలేదు. అయినా... ముని మాటలు విని తాను తప్పు చేశానని, అందువల్ల ఎన్నో వందల మంది నాశనం అయ్యారని భావించి పశ్చాతాపంతో ప్రాణం వదిలాడు. అది అతని సంస్కారాన్ని చూపుతోంది. పశ్చాత్తాపాన్ని మించిన పరిహారం లేదు. అందువల్ల గవరయ్య స్వర్గానికి వెళ్లడానికి అర్హుడు. ఇంక... ముని యొక్క ధర్మం- ప్రాపంచిక వాసనలు వదిలి దైవధ్యానంలో గడపడం! ఇందుకు విరుద్ధంగా ఈ ముని దైవధ్యానాన్ని మానేసి, గవరయ్య చేసే పాపాల పట్టిక తయారు చేయడం మొదలు పెట్టాడు. అది తప్పు. ఇందుమూలంగా ముని స్వర్గానికి వెళ్లడానికి అనర్హుడు. అయితే... తన మాటల మూలంగా గవరయ్య ప్రాణం వదిలినందుకు పశ్చాతాపంతో ఆయనకూడా ప్రాణాలు వదిలాడు. ఇందువల్ల ఆయన పాపానికి కొంత పరిహారం అయ్యింది. ఈ కారణం వల్ల ముని కొంతకాలం యమలోకంలో ఉండి ఆ తర్వాత స్వర్గలోకానికి వెళ్లడానికి అర్హుడు!"

యమ ధర్మరాజు తీర్పు ఎంతో సముచితంగా ఉందని భావించాడు ముని.

★★★